క్లుప్తంగా

బ్రెయిన్‌స్ట్రోక్‌పై అవగాహన



వ్యాయామాలు చేయిస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి

సంగారెడ్డి: ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) దినోత్సవాన్ని పురస్కరించుకుని హోప్ న్యూరో కార్డియాక్ హాస్పిటల్ వారు ప్రజలు స్ట్రోక్ బారిన పడకుండా వ్యాయామం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. మంగళవారం సంగారెడ్డి లోని ఐబి నుంచి కేఎఫ్‌సీ వరకు రన్‌ను జిల్లా ఏఎస్పీ సంజీవరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోప్ న్యూరో, కార్డియాక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, న్యూరో సర్జన్ డా.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పక్షవాతానికి గల కారణాలు, నివారణ మార్గాలను, చికిత్స విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఎంఎం అధ్యక్షుడు డా. ఉషాకిరణ్, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అతిమెల మానిక్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ కేజీబీవీ విద్యార్థినులు కోలుకున్నారు. దగ్గు, శ్వాస ఇబ్బందులతో బాధపడుతున్న 10 మందికి సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందించారు. ఐదు రోజులుగా కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు డీఈఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ గాయత్రీదేవి, జీసీడీఓ మాధవి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేయడంతో వారంతా కోలుకున్నారు. సోమవారం 8 మంది విద్యార్థినులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. మిగిలిన అశ్విని, మౌనిక ఇద్దరు విద్యార్థినులను మంగళవారం మధ్యాహ్నం డిశ్చార్జ్ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ తెలిపారు. అలర్జీ వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ఆయన స్పష్టం చేశారు.

రక్తదానంతో ప్రాణదానం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్‌లో మంగళవారం గౌరైకాపరుల సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ డైరెక్టర్ నగేష్ కుర్మ జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపుగా 30మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం నగేష్ కుర్మ మాట్లాడుతూ.. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం మరొకరికి ప్రాణదానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి,నరేష్ గౌడ్, మల్లేశం, బాబుజీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దీపావళి పండుగ సందర్భంగా తెల్లాపూర్ పరిధిలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు మంగళవారం తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలసి క్రీడాపోటీలు నిర్వహించారు. పలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.విద్యార్థులు తయారు చేసిన రంగు రంగుల లాంతరు, దీపాలను బహుమతులుగా అందజేశారు.

జాతీయ సమైక్యత శిబిరానికి విద్యార్థిని

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల విద్యార్థి నిఖిత జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికయిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె ఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ హర్యానాలోని జిద పట్టణంలోని రణబీర్ సింగ్ విశ్వవిద్యాలయంలో నవంబర్ 12 నుంచి 18 వరకు జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి తెలంగాణ నుంచి వెళ్లే ఆరుగురు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృందంలో తారా కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థి నిఖిత పాల్గొంటుందన్నారు.

పనులు వేగవంతం చేయండి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ పుష్ప కోరారు. మంగళవారం శ్రీనివాసనగర్‌కాలనీలోని బాలవిహార్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. పుష్ప మాట్లాడుతూ.. రూ.50 లక్షల నిధులతో పార్కు సుందరీకరణ పనులు జరుగుతున్నాయని వివరించారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, పార్కుకమాన్, వాల్‌పెయింటింగ్, యోగాస్థలం, విద్యుత్ దీపాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. నాణ్యత లోపించకుండా శ్రద్ధ తీసుకోవాలన్నారు.

కామ్రేడ్ ఓంకార్‌కు నివాళి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం ఖాజపూర్‌లో మంగళవారం కామ్రేడ్ మద్దికాయల ఓంకార్‌కు నివాళి అర్పించారు. ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి తుకరాం మాట్లాడుతూ.. కుల, మత ప్రాంతీయతత్వాలతో ప్రజలను మభ్యపెడుతున్న రాజకీయాలను ప్రక్షాళన చేసేందుకు ఓంకార్ పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంసీపీఐ (యు) డివిజన్ నాయకులు కుమార్, లాలునాయక్, భాస్కర్, నగేష్ పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’ లో అక్రమాలు

- పనులు చేయని వారి పేర్లు నమోదు.. డబ్బులు చెల్లింపు
- సామాజిక తనిఖీల్లో బట్టబయలు



సామాజిక తనిఖీ గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథకంలో పనులు చేయకున్నా హాజరు వేసి డబ్బులు దుర్వినియోగం చేశారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిపేర్లు నమోదు చేసి డబ్బులు కాజేసిన విషయం ఉపాధిహామీ సామాజిక తనిఖీల్లో బట్టబయలైంది. నారాయణఖేడ్ మండల పరిషత్తు సమావేశ మందిరం ఆవరణలో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 14వ విడత సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. సభలో డీఆర్పీలు గ్రామాల వారీగా జరిగిన పనులు, అవకతవకలను వెల్లడించారు. వెంకటాపూర్ గ్రామంలో ఉపాధిహామీలో జరిగిన అక్రమాలను కూలీల వారీగా వివరించారు. హైదరాబాద్, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ పట్టణాల్లో ఉన్న వారి పేర్లను నమోదు చేసిన పేర్లను వివరించారు. వీరి పేర్లపై వేలాది రూపాయిలు డబ్బులు చెల్లింపులు చేసి దుర్వినియోగం చేశారు. గ్రామంలో వారు పనులు చేయకున్నా చేసినట్లు నమోదు చేశారని గ్రామసభలో వెల్లడించినట్లు సామాజిక తనిఖీ అధికారిణి తెలిపారు. ఈ విషయంపై గ్రామానికి చెందిన ఇరువర్గాల వాగ్వాదానికి దిగారు. దీంతో విచారణ అధికారులు జోక్యం చేసుకొని పనులు చేసిన వారి పేర్లపై నమోదు చేయగా హాజరైన వారిని పిలిచి ఏఏ పనులు చేశారని ప్రశ్నించారు. వారు చెప్పిన పనులు, రికార్డుల్లో నమోదైన పనులకు పొంతన లేకపోవడంతో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. కొన్ని కుటుంబాల్లో అదనంగా జాబ్‌కార్డులు ఉండడం, వివాహం కాని వారిపేర్లపై కూడా జాబ్‌కార్డులు జారీ చేసినట్లు తేలింది. ఇలా మండలంలో ఆయా గ్రామాల వారీగా పలు అక్రమాలు వెలుగు చూశాయి. కొందరికి వంద రోజులు దాటినా చెల్లింపులు చేశారని వివరించారు. డబుల్ జాబ్‌కార్డులు ఎలా ఇచ్చారని, అక్రమాలపై ఉపాధి హామీ టీఏలు, సీఓలను అధికారులు నిలదీశారు. రాత్రి పొద్దుపోయే వరకు గ్రామసభ నిర్వహించారు. అక్రమాలు, దుర్వినియోగం అయిన డబ్బుల వివరాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది. సామాజిక తనిఖీ మండల సభలో అదనపు పీడీ బాల్‌రాజ్, అడిషనల్ విజిలెన్స్ అధికారి నాగేశ్వర్ రావు, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సుభాష్, స్టేట్ రిసోర్స్ పర్సన్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో ఇరువర్గాల వాగ్వాదం

పొగాకు నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పొగాకు నియంత్రణపై అవగాహన కల్పించారు. జిల్లా పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్ట, సిగరేట్, జర్దా, తంబాకు, పాన్‌మసాలా తదితర వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా తప్పదన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకానికి దూరంగా ఉండాలని విద్యార్థులను సూచించారు. ప్రధానోపాధ్యాయులు మన్మథకిషోర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, చంద్రశేఖర్, జైపాల్‌రెడ్డి, గురునాథ్, వెంకట్‌రావు, రవీందరానాయక్ పాల్గొన్నారు.

లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి

సంగారెడ్డి జోన్: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని వీరశైవ లింగాయత్, బలిజ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలో లింగాయత్ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే కులగణనలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరశైవ లింగాయత్, బలిజ అనే పేరుతో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గౌరవఅధ్యక్షుడు ధనంజయ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున పాటిల్, కోశాధికారి గోవురాజు, ముఖ్య సలహాదారులు శివకుమార్, ఉపాధ్యక్షుడు సంగిశెట్టి, అమర్నాథ్ సెక్రటరీలు, శివకుమార్, గొలిశ్వర్, నాగన్న, చెంద్రశేఖర్, మల్లికార్జున శెట్టి పాల్గొన్నారు.

ఉపాధి పథకంతో లబ్ధి



మాట్లాడుతున్న ఏపీఓ రమేష్‌కుమార్

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని మాటూర్‌లో మంగళవారం రైతులు, కూలీలతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకంలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేసే పనుల వివరాలను సేకరించారు. పథకంలోని వివిధ రకాల పనులు, రైతులు, కూలీలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. రైతులు, కూలీలు తమకు అవసరమయ్యే పనులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో టీఏలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.

కుక్కలకు కు.ని ఆపరేషన్లు



అవయవాల లెక్కింపును పరిశీలిస్తున్న కమిషనర్లు

నారాయణఖేడ్: కందిలోని యానిమల్ బర్త్ కేర్ సెంటర్‌లో మంగళవారం కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేశారు. ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్‌తో పాటు జోగిపేట మున్సిపల్ కమిషనర్, శానిటరీ అధికారుల పర్యవేక్షణలో శస్త్రచికిత్సలు నిర్వహించారు. అనంతరం వాటి అవయవాల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు.

ఇంటిగ్రేటెడ్ దుకాణాలు అప్పగించండి



వినతిపత్రం ఇస్తున్న నామరవికిరణ్ తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణాలను వ్యాపారులకు అప్పగించాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు నామ రవికిరణ్, వ్యాపారులు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్‌రావును కోరారు. మంగళవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నామ రవికిరణ్ మాట్లాడుతూ.. పట్టణంలో నిర్మించిన సమీకృత భవన సముదాయం వినియోగంలోకి రానందున మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుందన్నారు. కాంప్లెక్స్ దుకాణాల కేటాయింపు కోసం వ్యాపారుల లక్షల రూపాయలు డిపాజిట్ చేసి 20 నెలలు అవుతుందని అన్నారు. షాపులు అప్పగించకపోవడంతో ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకుంటున్నారని తెలియజేశారు. దుకాణాలను అప్పగించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాంప్లెక్స్ దుకాణాలపై స్టడీ చేసి తగు చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఎల్‌ఓసీ అందజేత

జహీరాబాద్: పట్టణంలోని గడి మహెలాలకు చెందిన ఎం.డీ.ముజఫర్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబం సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి కలిసి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఎల్‌ఓసీ మంజూరు చేయించి మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

మంత్రిని కలిసిన ముబీన్



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న ముబీన్

జహీరాబాద్: సీడీసీ చైర్మన్‌గా నియమితులైన అబ్దుల్ ముబీన్ మంత్రి దామోదరను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డితో కలిసి మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా ముబీన్ నియామక పత్రం అందుకున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **హద్నూర్ ఎస్ఐగా రాజశేఖర్**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్ ఎస్ఐగా రాజశేఖర్ నియమితులయ్యారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన రామానాయుడు సీఐగా పదో న్నతిపై వెళ్లాడు. ఆయనకు గత నెలలోనే సీఐగా పదోన్నతి లభించినప్పటికీ పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఇక్కడే విధులు నిర్వహించారు. తాజాగా ఆయ నను సంగారెడ్డికి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మనూర్ ఎస్ఐ రాజశేఖర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

◆ **ఘనంగా ఆయుర్వేద దినోత్సవం**

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని పీహెచ్‌సీ లో ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీలో వైద్యుడు గణపతిరావు, వైద్య సిబ్బంది గోపిరాజ్ తదితరులు ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి స్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు.

◆ **ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం**

సంగారెడ్డి ఎడ్యుకేషన్: డీఎస్సీ 2024లో మెరిట్ సాధించిన 1:3 అభ్యర్థుల ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల ఒరిజినల్ సర్టిఫికెట్ల ధ్రువపత్రాల వెరిఫికేషన్ మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని డీఈఓ కార్యాలయంలో ప్రారంభమైందని విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం 52 మంది అభ్యర్థులకు, 42 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు, మంగళవారం హాజరుకాని వారు బుధవారం హాజరై ధ్రువపత్రాల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

◆ **రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కాజిపల్లి బొల్లారం రహదారి విస్తరణ పనులు ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. పనుల్లో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న పలు ఇళ్లను తొలగించేందుకు యాజమానులతో మాట్లాడి ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ తొలగించేందుకు కృషి చేశారు. గ్రామస్తులు సహకరించడంతో పనులు చేపడుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్డును మరమ్మతులు చేసి బాగుచేశారు.

◆ **పారిశుద్ధ్య పనులు పరిశీలన**

కల్హేర్(నారాయణఖేడ్):మండలంలోని బీబీపేట జంలాతండా పంచాయతీలో పారిశుద్ధ్య పనులను మంగళవారం ఎంపీఓ శ్రీనివాస్ పరిశీలించారు. పారిశుద్ధ్యం పనులు చేస్తున్న కార్మికుడు నారాయణను అభినందించారు.

◆ **బ్యాడ్మింటన్‌లో మధుప్రియ ప్రతిభ**

సంగారెడ్డి: ఈ నెల 28న మెదక్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో సంయుక్త స్కూల్‌కు చెందిన మధుప్రియ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. స్కూల్ పీఈటీ సాయికృష్ణ ప్రోత్సాహంతో మధుప్రియ రాష్ట్రస్థాయికి వెళ్లడంపై కోఆర్డినేటర్ ప్రసన్న, ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఎండీ రితేష్‌కుమార్, తేజస్ మధుప్రియను అభినందించారు.

◆ **మందుబాబులకు జరిమానా**

సంగారెడ్డి క్రైమ్ : సంగారెడ్డి పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ట్రాఫిక్ ఎస్ఐ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోతిరెడ్డిపల్లిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, ఆరుగురు వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒక్కొక్కరికి రూ. 2000 చొప్పన జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్ జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు జరిమానా, జైలుశిక్ష విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని సంగారెడ్డి కోర్టులో హా జరు పరచగా 7 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా, ఒకరికి రెండు రోజులు శిక్ష జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంఘం సేవలతో ప్రయోజనం

- జాయింట్ రిజిస్ట్రార్ తుమ్మ ప్రసాద్



జాయింట్ రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం సేవలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర జాయింట్ రిజిస్ట్రార్ తుమ్మప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఝరాసంగం పీఏసీఎస్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం సభ్యులు స్వల్ప దీర్ఘకాలిక రుణాలు పొంది, ఆదాయం వచ్చే మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. అలాగే, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పుంసింగ్, శ్రీనివాస్, చైరన్ గౌసోద్దీన్, డైరెక్టర్‌లు మారుతీరావు పాటిల్, సంగన్న, కృష్ణ, సెక్రటరీలు నిసార్ అహ్మద్, శ్రీశైలం, విజయ్‌కుమార్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కస్టమర్లతో మర్యాదగా మాట్లాడాలి

- విజిలెన్స్ అండ్ ఎపీడీఎస్ సీఐ శ్యామల వెంకటేశ్



అవగాహన కల్పిస్తున్న శ్యామల వెంకటేశ్

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ కార్యాలయానికి వచ్చే కస్టమర్లతో మర్యాదగా మాట్లాడాలని విజిలెన్స్ అండ్ ఎపీడీఎస్ సీఐ శ్యామల వెంకటేశ్ అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా మంగళవారం పటాన్‌చెరు విద్యుత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. కార్యాలయానికి వచ్చే కస్టమర్లతో మర్యాదగా మాట్లాడి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ భాస్కర్, విజిలెన్స్ ఎస్ఐ వెంకట్ రాజు, నరేందర్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు రూ.12 వేలు చెల్లించాలి



ఆందోళన నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

నారాయణఖేడ్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేల చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు బాబురావు, రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్ బసవేశ్వర చౌక్ వద్ద ఆటోడ్రైవర్లతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఖేడ్‌లో ఆటోస్టాండ్, విశ్రాంతి భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సంఘ బాధ్యులు మాణిక్యం, దాస్, రాజు, అశోక్, రాములు, అంజి, విష్ణు, దావీద్, విఠల్, రసూల్, చిరంజీవి, సంతోష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కల్హేర్ మండలం మార్డి గ్రామానికి చెందిన పీరమ్మకు సీఎం సహాయనిధి నుంచి చెక్కు మంజూరయింది. మంగళవారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన స్వగృహంలో లబ్ధిదారుకు అందజేశారు. అలాగే, నాగలిద్దా మండలం ముక్తాపూర్‌కు చెందిన రైతు నగేష్ ఇటీవల మృతిచెందగా రైతు బీమా కింద రూ.5 లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును అతని భార్యకు ఖేడ్‌లోని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సోదరుడు నగేష్ షెట్కార్ అందజేశారు. నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాణిక్‌రావు పటేల్, జ్ఞానేశ్వర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం మంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-2002 పదోతరగతి పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులకు స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించి, ఆశీస్సులు తీసుకున్నారు. ఎన్నో సంవత్సరాల తరువాత కలిసిన స్నేహితులతో అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. ప్రస్తుతం జీవితంలో స్థిరపడ్డ విషయాలను ఒకరికొకరు పంచుకున్నారు. సమ్మేళనం గుర్తుగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్(ఎస్‌జీటీయూ) మొగుడంపల్లి మండల అధ్యక్షుడిగా బానోత్ కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య సమక్షంలో మంగళవారం మండల ఎస్‌జీటీ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.